క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కమలాపూర్: మండలంలోని కన్నూరుకు చెందిన సుమారు 50 మంది యువకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో మంగళవారం రాత్రి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. హుజూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, సర్పంచ్ పుల్లూరి రాంచందర్‌రావు, యూత్ అధ్యక్షుడు రాకేష్, రమాకాంత్ పాల్గొన్నారు.

కాశిబుగ్గ: ఓసిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ 32వ డివిజన్‌కు చెందిన బత్తుల కుమార్, 34, 35వ డివిజన్ల అధ్యక్షులు పరిమిల్ల భిక్షపతి, ఎస్కే సోహెల్ బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ కోసం పనిచేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



నడికూడ: మండల ఆటో యూనియన్ కార్యదర్శి గోనెల రమేష్ కుమారుడు రాహుల్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలుకాగా స్థానిక సర్పంచ్ ఊర రవీందర్‌రావు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కొంత ఆర్థిక సాయం అందించారు. బీఆర్‌ఎస్ గ్రామ కార్యదర్శి రావుల కిషన్, రామచందర్, వంశీ, మధుకర్ పాల్గొన్నారు.

మందిరం నిర్మాణానికి సహకరించాలి

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో నిర్మించనున్న క్రైస్తవ మందిరం నిర్మాణానికి ఆర్థికంగా సహకరించాలని స్థానిక యూత్ సభ్యులు కోరారు. ఈమేరకు బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి వినతిపత్రం అందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ అధ్యక్షుడు పెంబర్తి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు నవీన్, సభ్యులు సుమన్, సిద్ధు, కపిల్, పాల్గొన్నారు.

బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సునీల్



హన్మకొండ: తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమకొండలోని గుడిబండల్‌కు చెందిన కూచన సునీల్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. 16వ డివిజన్ పరిధి ధర్మారంలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో భరత్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని సునీల్ అందుకున్నారు. కాగా, తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆడెపు నగేష్, శివకుమార్, పవన్‌కు సునీల్ కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ సత్యనారాయణకు సేవారత్న అవార్డు



హసన్‌పర్తి: హసన్‌పర్తి మాజీ సర్పంచ్ డాక్టర్ సత్యనారాయణను సేవారత్న అవార్డుతో సత్కరించారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అందజేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందించినందుకు అవార్డును ప్రదానం చేశారు.

మాలధారణతో ఆధ్యాత్మిక చింతన

కాజీపేట అర్బన్: ఆధ్యాత్మిక చింతనకు దసరా పండుగ సందర్భంగా 31వ డివిజన్ న్యూశాయంపేటలో పలువురు దుర్గామాత మాలధారణను ధరించి బుధవారం ఇరుముడిని చేపట్టారు. దుర్గామాతను గంగ చెంతకు పంపిన తరుణంలో మాలధారణ స్వాములు ఇరుముడితో దుర్గామాతకు పూజలు నిర్వహించారు.

తల్లిచెంతకు పిల్లలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలో బుధవారం తప్పిపోయిన ఇద్దరు చిన్నారులు గంట వ్యవధిలోనే తల్లిచెంతకు క్షేమంగా చేరుకున్నారు. ఇరువురు చిన్నారులు ఆటలాడుతూ రోడ్డుపైకి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లే దారి మరిచిపోయారు. కాలనీలోనే తిరుగుతుండగా పోలీసులు వారిని చేరదీసి వివరాలు సేకరించారు. అనంతరం పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే రమేష్
- అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండలంలోని నందనం గ్రామానికి చెందిన యాకర సుప్రియ, యాకర శ్రీనాథ్ హర్యానాలో జరిగిన జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కాగా బుధవారం స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ క్రీడాకారులను శాలువాతో సత్కరించి అభినందించారు. అంతర్జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే అరూరి రమేష్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన యువకులు బీఆర్‌ఎస్ చేరుతున్నారని అన్నారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రతిపక్షాలకు డిపాజిట్లు గల్లంతవుతాయని జోష్యం చెప్పారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో బీజేపీ మండల మైనారిటీసెల్ అధ్యక్షుడు మహ్మద్ అజీమ్, జంపాల సుమన్, హనీఫ్, ఆఫ్రోజ్, పొన్నం గోపాల్, తోట రవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జెడ్పీ వైస్‌చైర్మన్ గజ్జెల శ్రీరాములు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్‌అలీ, పార్టీ మండల అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కంజర్ల రమేష్, ఎంపీటీసీ తాటికాయల రమేష్, ఉప సర్పంచ్ బొల్లం ప్రకాశ్, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ పడిదల సమ్మారావు, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు అబ్బాస్‌అలీ, గ్రామ అధ్యక్షుడు ఆకుతోట యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆట స్థలానికే ఎసరు..!

- బీఆర్‌ఎస్ నాయకుల పనేనంటూ విమర్శలు



శిలాఫలకం వేసిన చోట పాతిన జెండాలు

ఐనవోలు: 'క్రీడలు మనం ఆడేవాళ్లమా.. వాటితో మనకు పనేంటి' అనుకున్నారో ఏమో ఏకంగా క్రీడా మైదానానికే ఎసరు పెట్టారు కొందరు కబ్జాదారులు. మండలంలోని పున్నేలు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 121లో ఎకరం భూమి కబ్జాకు గురి అయ్యినట్లు చర్చ జరుగుతోంది. సంవత్సరం క్రితం రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో పంచాయతీ పాలకవర్గం గ్రామంలో 121 సర్వేనంబర్‌లో కొంత ప్రభుత్వ స్థలం ఉందని గుర్తించి క్రీడా ప్రాంగణానికి అనువుగా ఉంటుందని తీర్మానం చేసుకున్నారు. తహసీల్దార్ ఈ స్థలం క్రీడా ప్రాంగణానికి కేటాయించగా, మండల పరిషత్ ఆధ్వర్యంలో సుమారు రూ. 3లక్షలు కేటాయించి కబడ్డీ, వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. కాగా 2022 సెప్టెంబర్ 29వ తేదీన ఎమ్మెల్యే అరూరి రమేష్ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు క్రీడా ప్రాంగణంతో పాటు సర్వే నంబర్ 121లో గల సుమారు ఎకరం భూమిలో గుడిసెలు వేసి జెండాలు పాతారు. దీంతో భూమి కబ్జాకు గురవుతున్నట్లు గుర్తించిన సీపీఎం మండల కార్యదర్శి లింగయ్య బుధవారం విలేకరులతో మాట్లాడారు. నిరుపేదలు ఇంటి స్థలాల కోసం జెండాలు పాతి ఉంటారని తొలుత అందరు భావించారని, అయితే ఈ ప్రభుత్వ స్థలాన్ని కాజేయాలనే దురుద్దేశ్యంతోనే కొంతమంది అధికార పార్టీ నేతలు వారి అనుచరులతో గుడిసెలు వేయించి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భూ కబ్జాకు పెద్దల అండదండలు ఉన్నాయని ఆరోపించారు. దీంతో మండల అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ మాయమాటలు నమ్మొద్దు

- బీజేపీ రాష్ట్ర నాయకుడు కాళీప్రసాద్‌రావు



హోటల్‌లో దోసె వేస్తున్న కాళీప్రసాద్

ఆత్మకూరు: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల మాయమాటలు ప్రజలు నమ్మొద్దని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని నీరుకుళ్ల, పెంచికలపేట గ్రామాల్లో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఎన్నికల్లో గెలిపిస్తే పథకాలు అందిస్తామని నమ్మబలుకుతున్నారని, మళ్లీ చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకుల మాటలు వింటే ప్రమాదంలో పడడం ఖాయమని అన్నారు. ఇప్పటి వరకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టించిన దాఖలాలు లేవన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం హోటల్‌లో దోసె వేసి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, రాజు, కార్యదర్శి పైడి, ఓబీసీ జిల్లా కార్యదర్శి రవి, వెంకటేశ్వర్లు, కమలాకర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వార్డు సభ్యులు

నడికూడ: మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ వార్డ్ సభ్యులు భోగి రాములు, భోగి కొమురయ్య బుధవారం బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు, ఉద్యమకారులు బీజేపీలో చేరుతున్నారని అన్నారు. ఎన్నికల్లో చల్లా ధర్మారెడ్డిని ఓడించి పరకాల ప్రజలకు విముక్తి కలిగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, బూత్ అధ్యక్షుడు భోగి లక్ష్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి గోనెల కోటి, దండు సురేష్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

శాయంపేట: మండల కేంద్రం నుంచి అరెపల్లి, కొత్తగట్టు సింగారం గ్రామాల మీదుగా హుస్సేన్‌పల్లి వరకు కొనసాగనున్న బైక్ ర్యాలీకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి బుధవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ ర్యాలీని టీపీసీసీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు జెండా ఊపి ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన లోకలబోయిన శాంతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా బుధవారం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

శరీర దానానికి ప్రిన్సిపాల్ అంగీకారం



అంగీకార పత్రాన్ని అందజేస్తున్న ప్రభాకర్

రామన్నపేట: తన మరణాంతరం తన పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాల విద్యార్థులకు వైద్య విద్య నిమిత్తం దానం చేస్తానని అంగీకరిస్తూ ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీ.ప్రభాకర్ అంగీకార పత్రం రాసిచ్చారు. తెలంగాణ ఐ, ఆర్గన్ బాడీ డోనర్స్ అసోసియేషన్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఈ మేరకు ప్రభాకర్ తన అంగీకార పత్రాన్ని అసోసియేషన్ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, సలహాదారులు రాజేంద్రప్రసాద్, మోహన్ వారణాసి, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

హన్మకొండ అర్బన్: చట్టాలపై మహిళలు అవగాహన ఉండాలని కేస్ వర్కర్ వినీల అన్నారు. నగరంలోని జితేందర్ కాలనీలోని మహిళలకు సఖి సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినీల మాట్లాడుతూ గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపుల బాధితులకు సఖి సెంటర్ అండగా ఉంటుందని చెప్పారు. బాధిత మహిళలు 181 టోల్‌ఫ్రీ నంబర్ లేదా 0870 2452112 నంబర్‌కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని సూచించారు. ఈక్రమంలో బాధిత మహిళలు, బాలికలకు వైద్య, న్యాయ, పోలీస్ సహాయం అందజేయనున్నట్లు చెప్పారు.

కేంద్ర బలగాల కవాతు

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో కేంద్ర బలగాలు బుధవారం కవాతు నిర్వహించాయి. సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, ఎస్సైలు విజయ్‌కుమార్, రాజ్‌కుమార్, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఇందిర



ప్రచారంలో మాట్లాడుతున్న ఇందిర

వేలేరు : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని మల్లికుదుర్ల, గుండ్లసాగర్, సోడాషపల్లి గ్రామాల్లో ఆరు గ్యారెంటీ స్కీంలపై విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం సీఎం కేసీఆర్ మాయమాటలను ప్రజలు నమ్మొద్దని కోరారు. కడియం శ్రీహరి దళిత దొర అని, అతను గెలిస్తే నియంతపాలన మళ్లీ మొదలవుతుందని ఆరోపించారు.

గిఫ్ట్‌ప్యాకెట్ల పంపిణీని అడ్డుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్, గాజులు పంపిణీ చేస్తున్న క్రమంలో ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా గిఫ్ట్ ప్యాకెట్లు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. కోడ్ ధిక్కరణ అవుతుందని అభ్యంతరం తెలుపుతూ గిఫ్ట్‌ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో గిఫ్ట్ ప్యాకెట్లు అందని మహిళలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారుల వాహనాన్ని చుట్టుముట్టి అడ్డుకున్నారు. అధికారులు బీఆర్‌ఎస్ పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు చేరుకుని మహిళలను చెదరగొట్టి ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను పంపించారు. గిఫ్ట్ ప్యాకెట్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కత్తి సంపత్, ఎంపీటీసీ జల్తారి సంపత్, ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, నాయకులు తిరుపతిరెడ్డి, లక్ష్మణ్ నాయక్, సలీం, మాలిక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు

ఎన్నికల విధులకు ఆటకం కలిగించారంటూ ఎలక్షన్ కమిషన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ అధికారి నరేష్ బాబు ఫిర్యాదు చేసినట్లు స్థానిక ఎస్సై పేర్కొన్నారు. మల్లికుదుర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇందిర ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ఆపార్టీ కార్యకర్తలు కె. ప్రభాకర్, భట్టు పరమేష్, రాంచందర్ రూ.12,859 విలువ గల పసుపు, కుంకుమ, జాకెట్లు, గాజులు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు వాటిని స్వాధీనం చేసుకునేందుకు అక్కడకు వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలో తమ వాహనాలను అడ్డుకుని విధులకు ఆటకం కలిగించినట్లు అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

గానుగనూనె ఉత్పత్తిని ప్రోత్సహించాలి



తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

దామెర: ఎద్దుగానుగల నూనె తయారీని ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోగిల్వాయిలో మహిళా వ్యవసాయదారుల ఎద్దుగానుగ నూనెల తయారీ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రకృతి సహజసిద్ధంగా తీసిన గానుగ నూనే ఆరోగ్యానికి దోహద పడుతుందన్నారు. ప్రతిఒక్కరూ గానుగనూనెను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, పీఏసీఎస్ డైరెక్టర్ గుండా చంద్రమోహన్, ఎంపీటీసీ సంగరబోయిన మౌనికకిరణ్, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, గుండా అశోక్, విజయలక్ష్మి, సారంగపాణి పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న చంద్రమౌళి

నడికూడ: త్వరలో జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి అన్నారు. మండలంలోని బుధవారం వెంకటేశ్వర్లపల్లి, నార్లపూర్, చర్లపల్లి, చౌటుపర్తి గ్రామాల బీఆర్‌ఎస్ బూత్ కమిటీల కన్వీనర్, కో కన్వీనర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందా కుమారస్వామి, నందికొండ గణపతిరెడ్డి, మచ్చ రవీందర్, జయపాల్‌రెడ్డి, సాంబశివరెడ్డి, బొల్లారం అనిల్‌కుమార్, పోచంపల్లి రఘుపతి, దోమ పవన్‌తో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ (టీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా గఫార్



గఫార్

ధర్మసాగర్: మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ గఫార్‌ను పీఆర్‌టీయూ (టీఎస్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి బుధవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 13 మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల అభిప్రాయం మేరకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



ఆత్మకూరు : వీధుల్లో దుర్గామాత శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని పోచమ్మసెంటర్‌లో శ్రీవేణుగోపాలస్వామి భజనమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. అనంతరం బుధవారం దుర్గామాత శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు భజన సంకీర్తనలతో వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం దుర్గామాత విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలోని ఎస్‌పీటీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పురవీధుల గుండా శోభాయత్ర చేపట్టారు. దుర్గామాతకు పూజారి మామిడి సాయి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. డీజే పాటల నడుమ శోభాయాత్ర కొనసాగగా మహిళలు కోలాటాలతో నృత్యాలు చేశారు. అనంతరం తాళ్లకుంట చెరువులో దుర్గాదేవి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. విగ్రహదాతతో పాటు, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనోత్సవం



యాగశాలలో పూజలు చేస్తున్న వేద పండితులు



బొడ్రాయికి జలాధివాసం చేస్తున్న మహిళలు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై రుద్రమాంబ నగర్‌లో బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పోలోజు భాస్కరాచార్యుల బృందం నేతృత్వంలో గ్రామ దేవత (బొడ్రాయి) పునఃప్రతిష్ఠాపన, కలశ స్థాపన, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, సర్వప్రాయశ్చిత్తం, ద్వారతోరణ పూజ, పుణ్యాహ వాచనం, పంచగవ్య ప్రాశన, దీక్షా కంకణ ధారణ, అఖండ దీప స్థాపన, నవగ్రహ సర్వతో భద్రమండప అవాహనాలు, గ్రామ దేవతలు, ప్రతిష్ఠాపన యజ్ఞం ప్రారంభోత్సవం జరిగాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, దిడ్డి కుమారస్వామి, సిద్దం రాజుతో కలిసి బొడ్రాయి వద్ద పూజలు చేశారు. ప్రజలు హాజరై యాగశాల ప్రవేశం చేసి హోమాన్ని తిలకించారు. అనంతరం సాయంత్రం 6గంటలకు జలాధివాసాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ముగింపు వేడుకల్లో పాల్గొన్న భక్తులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే దేవాలయ సముదాయంలో వేంకటేశ్వర స్వామి 69వ బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణంలో ఏడుగురు దంపతులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం జరిగిన సత్యనారాయణ స్వామి వ్రతంలో 12 జంటలు పాల్గొన్నాయి. భక్తులకు ప్రసాద వితరణ చేసి, మహా అన్నదానం చేశారు. ప్రజలందరూ సుఖ, శాంతులతో ఉండాలని భక్తులు వేడుకున్నారు. బ్రహ్మోత్సవాలను ఆసక్తి తిలకించిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి ఆంజనేయశాస్త్రి, లక్ష్మీనర్సింహ శాస్త్రి, సత్యనారాయణ శాస్త్రి, అమరేంద్ర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పరశురాం, ఏఎస్‌ఆర్.ప్రసాద రావు, సత్యప్రకాశ్, కురుమయ్య, తిరుపతి, లక్ష్మీమురళి, విజయలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

'అభిజ్ఞాన్ 2.0' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి: వచ్చేనెల 16, 17, 18వ తేదీల్లో అన్నాసాగరంలోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న అభిజ్ఞాన్ 2.0 పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సర్వీస్ మేనేజ్‌మెంట్, డేటా మైనింగ్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, యూసింగ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, క్లౌడ్ బేస్‌డ్ ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్స్, సోషల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అనే అంశాలపై ఇండస్ట్రీ నిపుణులతో సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ మూల రాము, డాక్టర్ కే.మహేందర్ పాల్గొన్నారు.